రమాయణం

**వానొచ్చే ముందు వాతావరణం అకస్మాత్తుగా మారిపోయేది. చల్లని గాలి వీచేది. ఒక రకమైన మట్టి వాసనతో వచ్చే ఆ గాలి ఒంటిని తాకుతూ ఉంటే.. చెప్పరాని ఆనందం కలిగేది. తొలకరి జల్లులు పడగానే.. రైతులు వ్యవసాయ పనులు మొదలుపెడితే.. మేము రకరకాల ఆటల్లో మునిగితేలేది.**

# వానా వానా వల్లప్పా..



ఇంటి దగ్గర ఉన్నప్పుడు వాన చినుకులొస్తే గబగబా వాకిట్లోకి పరిగెత్తి.. ''వానా వానా వల్లప్పా.. చేతులు జాపు చెల్లప్పా! తిరుగూ తిరుగూ తిమ్మప్పా.. తిరుగలేను నరసప్పా!'' అంటూ అక్కా, నేనూ చేతులు ఇంటూ ఆకారంలో పట్టుకుని బిస్తీ తిరిగేవాళ్లం. చినుకులు పెరగగానే.. ''ఏయ్ పిల్లలూ! తడుస్తరు. మళ్ల సర్దీకి ఒస్తది.. లోపలికి రాండి'' అని అమ్మ అనేదాకా అట్లనే వానలో తడుస్తూ గిరగిరా తిరిగేవాళ్లం. వాన వచ్చి తగ్గాక మా ఇంటి ముందున్న కాలువలోంచి చాయ్ రంగులో నీళ్లు జలజలా ప్రవహిస్తూంటే.. ''చాయ్, చాయ్!'' అని అరిచేవాళ్లం. పాత నోట్ పుస్తకాల్లోంచి కాగితాలు చింపి, కాగితం పడవలు చేసి నీళ్లలో వదిలేవాళ్లం. ''నా పడవ ముందు!'' అంటే.. ''నా పడవే ముందు!'' అని సంబురపడేవాళ్లం. నేనైతే చుట్టుపక్కల నిలబడ్డ పిల్లలకు నోట్‌బుక్‌లో కాగితాలు అయిపోయేదాకా చింపి ఇచ్చేదాన్ని.

బళ్లు తెరిచిన కొత్తలో అప్పటిదాకా ఎండగా ఉండి, ఉక్కపోసినా (మాకు క్లాసులో ఫ్యాన్లు ఎక్కడివి?) మూడిటికి మెల్లగా మబ్బుపట్టి, తీరా బడి వదిలే సమయానికి టపటపా జల్లులతో వాన మొదలయ్యేది. మేము క్లాసులో కూర్చునో, వరండాలో నిలబడో వర్షాన్ని ఇష్టంగా చూసేవాళ్లం. చాలామంది పిల్లలకు గొడుగులు ఉండేవి కాదు. అసలు అప్పట్లో ఇంటికొక నల్ల చెత్రి ఉంటేనే గొప్ప. ఒక్కొక్కసారి వర్షం పొద్దున్నే తయారయ్యేది. ''పొద్దునొచ్చిన వాన, సాయంత్రం వొచ్చిన చుట్టం పోనేపోరు!'' అనేది అమ్మ.

మేము ఆదివారం ఎప్పుడైనా మా పొలం దగ్గరకో, చెల్క దగ్గరకో పోయేవాళ్లం. పచ్చిగడ్డి మీద గునగున నడుచుకుంటూ ఎర్రని మఖ్‌మల్ లాంటి ఆరుద్ర పురుగులు కనిపించగానే.. వాటిని పట్టుకుని అరచేతిలో పెట్టుకుని చూసేవాళ్లం. నాన్న చూస్తే.. ''ఒద్దొద్దు.. పాపం! వాటిని వదిలిపెట్టండి'' అనేవాడు.

ఇప్పటి వాతావరణశాఖ వాళ్లలాగా అప్పటి రైతులు గాలి తీరును బట్టి వాన రాకడ చెప్పేవారు. 'ముర్కశిర కార్తె గర్జించాలె!' అనేవారు. అంటే, ఉరుములు ఎక్కువగా ఉంటాయని అర్థం. చిన్న పుశాల (పుష్యమి), పెద్ద పుశాల (పునర్వసు)లాంటి వాన కార్తెలన్నీ వాళ్లకు గుర్తే. 'మఘ గర్జన, ఆశ్లేష లస లస!' అనేవాళ్లు. అంటే.. మఘ కార్తెలో మేఘాలు గర్జిస్తాయనీ, ఆశ్లేషలో వానలు బాగా కురిసి నేలంతా బురదగా ఉండి కాళ్లకు లసలస బురద అంటుతుందని అలా అనేవారు. 'ఆరుద్ర వాన అరికాలు తేమ' అంటే.. ఆరుద్ర కార్తెలో వర్షాలు బాగా కురిసి నేలమీద కాలుపెడితే అరిపాదాలు కూడా తడుస్తాయని అర్థం. 'హస్త, చిత్తజల్లులు, స్వాతి జల్లులు చేనుకు మంచివే!' అనేవారు. అంటే ఒకేసారి పెద్దగా వానలు పడకుండా అప్పుడొక జల్లూ, ఇప్పుడొక జల్లూ పడితే కంది, పెసర, జొన్న, సజ్జ, ఆముదం లాంటి చేన్లకు నీరు అందుతుందని వాళ్ల ఆశ. శ్రావణ మాసంలో ఆడవాళ్లు చేన్లలో పెసర కాయలు తెంపేటప్పుడు అకస్మాత్తుగా ఒక జల్లు కురిసేది. వాళ్లు కొంగులు తలపై కప్పుకొని చెట్టు నీడలోకి పరిగెత్తేవారు. ఎంత వేగంగా వచ్చేదో అంతే వేగంగా పోయేది వాన. 'పెసరుకాయ జల్లులు, ఎంతెల్లం పోతయి' అనుకుంటూ.. వాన తగ్గగానే మళ్లీ చేనులోకి కదిలేవారు. ఒక్కోసారి రెండు మూడు రోజులు ఎడతెగకుండా ముసురు కురుస్తూనే ఉండేది. వాటిని 'తుపాకి వానలు' అనేవారు. బహుశా తుఫాను వానలు కాబోలు!

''పుబ్బ ఒచ్చే బూసులేసె.. కంకులల్ల పాలుబోసె'' అన్న మాట మా అమ్మ చెప్పింది. పుబ్బ కార్తెలో జొన్న, మక్కజొన్న, సజ్జ వంటి చేలలో లేత కంకుల్లో అప్పుడప్పుడే నూగులా బూసులు బయల్దేరి, కంకి గింజల్లో పాలు వచ్చి బలంగా తయారవుతాయని ఆ మాట పుట్టింది. ఒక్కోసారి వర్షాలు అస్సలు కురవక వర్షాభావ పరిస్థితులు ఏర్పడేవి. దసరా దాక చూసి అప్పటికీ సరిగా వర్షాలు కురవకపోతే.. ఇక ఆఏడు కరువు తప్పదని భావించేవారు. ''ఉత్తర జూసి ఎత్తర గంప.. విశాఖ జూసి ఇడువర కొంప' అనే సామెతను కూడా మా అమ్మ చెప్పేది. ఇన్ని కార్తెల్లో కూడా వాన రాకపోతే ఉత్తరలోనైనా వర్షాలు పడేవట. ఆ తరువాత విశాఖ.. ఆఖరి ఆశ కార్తె. అప్పుడు కూడా వానలు లేకపోతే వ్యవసాయ కూలీలు తట్టా బుట్టా సర్దుకుని కొంప విడిచి ఏదైనా పని దొరుకుతుందని నగరానికి వలస పోయేవారట.

వాన వెలసినాక వాటిమీద పడ్డ దుమ్మంతా పోయి.. చెట్లన్నీ కొత్తగా ఆకుపచ్చగా తళతళమంటున్న ఆకులతో మెరిసేవి. వాటికి వాన తలంటు పోసేదన్నమాట. అప్పుడప్పుడూ ఆకాశంలో ఏడురంగుల పెద్ద ఇంద్రధనుస్సు ఏర్పడేది. 'సింగిడి పొడిసింది' అనేవారు రైతులు. ఆ తరువాత సైన్స్ పుస్తకంలో 'కాంతి పరావర్తనము' పాఠంలో రెయిన్‌బో గురించి చదివినపుడు.. 'ఇది మనం ప్రాక్టికల్‌గా ఎప్పుడో చూసినం గదా!' అనిపించేది.

వర్షాలు బాగా కురిసి చెరువు నిండితే.. చెప్పలేని ఆనందం ఉండేది. ''చెరువు మత్తడి పోస్తుందా?!'' అని ఇంటికి ఎవరొచ్చినా అడిగేవాళ్లం. ''ఆఁ.. నిన్నటి సందే జర పోస్తాంది'' అని వాళ్లు చెప్పగానే.. ఆ వచ్చే ఆదివారమే అమ్మను ఏవైనా తినడానికి చేసిమ్మని అడిగి, అలుగు పోసేదగ్గరికి మా కజిన్స్, మేమూ వెళ్లేవాళ్లం. మమ్మల్ని వెళ్లనిచ్చి నాన్న వెనకాలే ఎవరినైనా పంపేవాడు. మత్తడి మీద నీళ్లు ఒక అడుగు ఎత్తులో పోతూంటే.. కుచ్చిళ్లు ఎత్తి పట్టుకుని పాదం పైకి ఎత్తకుండా పాకుతూ బ్యాలెన్స్ చేస్తూ నడుస్తూ ఉంటే భలే మజాగా ఉండేది. నిండా నీటితో ఉన్న చెరువు అలలతో 'డుబుంగ్ డుబుంగ్' అంటూ తబలా ధ్వనులు చేస్తుంటే ఎంజాయ్ చేసేవాళ్లం. కాసేపయ్యాక ఓ చెట్టు కింద రాళ్ల మీద కూర్చుని తెచ్చుకున్నవి తిని ఇంటిదారి పట్టేవాళ్లం. ఇంటికొచ్చాక మా నానమ్మ.. ''నిండుగున్న చెరువు బలి కోరుతది. ఎందుకమ్మా పిల్లల్ను గట్ల పంపేది?'' అని అమ్మతో అనేది. చాటుగా మాకు దిష్టి తీసేది. వర్షాలు లేక ఓ మూడేళ్లు బాగా కరువొచ్చినప్పుడు మా ఊరి చెరువు ఎండిపోయి నెర్రెలు పారింది. ఆ ఏడు చెరువులోకి దిగి బతుకమ్మ ఆడాం. కానీ, నీళ్లు లేని చెరువును చూసి కన్నీళ్లు వచ్చాయి. బతుకమ్మే ఆడబుద్ధి కాలేదు. ''వొచ్చే ఏడన్న వానలు బగ్గ పడేటట్టు జెయ్యి బతుకమ్మ తల్లీ!'' అని ఆడోళ్లంతా పాటలు పాడారు. నీళ్లతోనే మనిషి జీవితం కదా! ■




**నెల్లుట్ల రమాదేవి**
రచయిత్రి